క్లుప్తంగా

క్రీడా సామగ్రి పంపిణీ

చిట్టమూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈఓ బీవీ కృష్ణయ్య మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, 74 ప్రాథమిక పాఠశాలలకు ఆట వస్తువులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను శుభ్ర పరిచేందుకు ఉపయోగించే మెటీరియల్‌ను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించారన్నారు. వాటిని శుభ్ర పరిచేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోగిలి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, సీఆర్పీలు ధనుంజయ, శశి పాల్గొన్నారు.

శిక్షణతోనే సత్ఫలితాలు


బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

చిల్లకూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ప్రతిభను గుర్తించి వారికి శిక్షణ ఇస్తే సత్ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ సనత్‌కుమార్ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రంలోని పిల్లలకు పలు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. వర్షాల కారణంగా వారికి బహుమతులు ఇచ్చే అవకాశం లేక పోవడంతో ప్రస్తుతం దాతల సహకారంతో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 రఫూఫ్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శారదమ్మ, సహిత ఉపాధ్యాయులు నాగరాజు, లలిత పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాతో చేయూత


నగదు అందజేస్తున్న చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్: జీవనాధారం కోల్పోయిన బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదుతో చేయూత లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణంలోని పాత బీడీ కాలనీలో ఉన్న మహబూబ్‌బీ (49) అనే మహిళ అనారోగ్యంతో ఈనెల 11 తేదీన మరణించింది. ఈ క్రమంలో మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులకు మంజూరైన వైఎస్సార్ బీమా నగదును మున్సిపల్ చైర్ పర్సన్ వారి నివాసం వద్దకు వెళ్లి మృతురాలి కుమారుడు షేక్ నాయబ్ బాషాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఆనంద్, శ్రీదేవి, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

వెంకటగిరిరూరల్: రైతులు అధికారుల సూచనలు పాటించి, పంటలు సాగుచేసుకోవాలని ఏడీ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని వల్లివేడులో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగుచేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువగా నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. రబీలో 14 వారాలపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

నిమ్మ తోటల పరిశీలన


దెబ్బతిన్న నిమ్మతోటను పరిశీలిస్తున్న ఏడీ

సైదాపురం: మండలంలోని మర్లపూడి, కోమటి గుంటరాజుపాళెం, కొమ్మిపాడు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న నిమ్మతోటలను మంగళవారం ఏడీ హైమావతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో దెబ్బతిన్న వరి, నిమ్మ, బొప్పాయి, మిరప పంటల నష్టంపై తమ సిబ్బంది ద్వారా పూర్తిస్థాయిలో నివేదికలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు.

అమ్మవార్లకు విశేషాలంకరణలు



నాయుడుపేటటౌన్: కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా మంగళవారం మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు విశేషాలంకరణలు చేశారు. పట్టణంలోని అఖిలాండేశ్వరి ఆలయంలో అమ్మవారికి చందన అలంకరణ చేశారు. తిమ్మాజికండ్రిగ సమీపంలోని దుర్గామల్లేశ్వరిదేవి ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

మహాకాళేశ్వరుడిగా మార్కండేశ్వరుడు



చిట్టమూరు: మల్లాంలోని కామాక్షీదేవి సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా స్వామివారు ఉజ్జయిని మహాకాళేశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి సహస్రదీపాలతో ఆలయాన్ని అలంకరించారు. 108 జ్యోతులు వెలిగించారు. అనంతరం పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

మాది పెత్తందార్ల పార్టీ కాదు


కలువాయి: వలంటీర్లకు బ్రోచర్లను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

కలువాయి: వైఎస్సార్ సీపీ పెత్తందార్ల పార్టీ కాదని, ప్రజల పార్టీ అని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం కుల్లూరు ఒకటో సచివాలయం పరిధిలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన బస్టాండ్ సెంటర్‌లో పార్టీ జెండాను ఎగురవేశారు. ఆ తరువాత సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపు అమలు చేసిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో కుల, మత, పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుందని చెప్పారు. ప్రజలు కూడా ఆలోచించి తమకు ఎవరు మేలు చేశారో వారినే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని పథకాలను నూరుశాతం అమలు చేశామని, అందుకే తాము ప్రజల వద్దకు వచ్చి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఎంపీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం యజ్ఞపవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

రాపూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీ దయాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి అన్నారు. రాపూరు మండలం నెల్లేపల్లి సచివాలయంలో మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం ఎదుట సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు, పార్టీజెండాను ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వ్యవసాయసలహా మండలి చైర్మన్ రవీంద్రారెడ్డి, వెంకటరమణారెడ్డి, మనోహర్‌రెడ్డి, కే మధురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పెంచలయ్య, నరసింహారెడ్డి, పిచ్చిరెడ్డి, రమణారెడ్డి, లీలామోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు తీర్చిన ఘనత జగనన్నదే

దక్కిలి (బాలాయపల్లె): ప్రజల అవసరాలు, బాధలు, కష్టాలు తీర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొట్టికాడు సచివాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బాబి చౌదిరి, సర్పంచ్‌లు వీ సుప్రజ, ఎం గోపీకృష్ణారెడ్డి, నాయకులు హరికృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, జీ గోపాల్ యాదవ్, ప్రసాద్, శేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు

చిల్లకూరు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరాయని జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య అన్నారు. మండలంలోని వల్లిపేడు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాలకు చెందిన బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు నేరుగా చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెంగయ్య, సర్పంచ్‌లు వెంకటరమణయ్య, శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ హరికృష్ణ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


రాపూరు: నెల్లేపల్లి సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


దక్కిలి: మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి


చిల్లకూరు: వల్లిపేడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

జయప్రదం చేయండి

గూడూరురూరల్: పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమంలో ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న జైభీం రెండో జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని జైభారత్ జాతీయ కార్యదర్శి జలిహాని లోకేశ్ కోరారు. గూడూరులోని బజారువీధిలో ఉన్న గాంధీ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జైభారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శులు జలిహాని శ్యాంసుందర్, నాగరాజు, జిల్లా అధ్యక్షుడు జలిహాని విజయ్‌కుమార్, షేక్ మొహ్మద్, సలీం, రమేష్, లక్ష్మయ్య, అనిల్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

సైదాపురం: కార్తీక మాసం పురస్కరించుకుని సైదాపురంలో ఉన్న సిద్ధలయ్య స్వామి గ్రామోత్సవం బలిజ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపకాంతులు, విచిత్ర వేషధారణలు, తప్పెట్లు, తాళాల నడుమ స్వామివారి గ్రామోత్సం జరిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.గంగాధర్‌రావు, ఏ సతీష్, మురళి, రవీంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య రుద్రాభిషేక పూజలు


పుణ్యస్నానాలు ఆచరిస్తున్న మహిళా భక్తులు

వాకాడు: కార్తీక మాసంలో వచ్చే చివరి అమావాస్య సందర్భంగా మంగళవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో సైకత శివునికి రుద్రాభిషేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపురం భీమేశ్వరస్వామి ఆలయ పండితులు కుందుర్తి సుధాకర్‌శర్మతోపాటు పలువురు వేద పండితులు మట్టితో చేసిన శివునికి రుద్రాభిషేకం, వివిధ రకాల పూజలు చేశారు. ఈ పూజలకు భక్తులు తిరుపతి, నెల్లూరు జిల్లాల నలు మూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని తరించారు. గత 14 ఏళ్లుగా ఈ తరహా పూజలు సముద్ర తీరంలో నిర్వహిస్తున్నట్లు సుధాకర్‌శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు వీ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రాపూరు: కార్తీక అమావాస్య సందర్భంగా మంగళవారం రాపూరులోని శివాలయంలో రామనాథేశ్వర స్వామి, పర్వతివర్ధని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు, అమ్మవారికి కుంకుమార్చన సేవ, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం నిర్వహించారు.

లింగ నిర్ధారణ చట్టవిరుద్ధం


అధికారులతో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ మునిలక్ష్మి

గూడూరురూరల్ : లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ మునిలక్ష్మి తెలిపారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వైద్య, రెవెన్యూ, పోలీసు, ఐసీడీఎస్ శాఖల అధికారులతో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మునిలక్ష్మి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై తరచూ మీడియాలో వార్తలు రావడం విచారకరమన్నారు. లింగ నిర్ధారణ ప్రక్రియలో భాగంగా మొబైల్ స్కాంగ్ వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ బాబు, నెప్రూరెడ్డి పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

సూళ్లూరుపేట రూరల్: వర్షాలకు వరి పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీతో అందజేసే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మన్నేముత్తేరి ఆర్బీకే పరిధిలో మంగళవారం వ్యవసాయాధికారులతో రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి మరింత ప్రోత్సాహం


దక్కిలి: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న ఎంపీడీఓ

దక్కిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ టీ ప్రసన్నకుమారి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అధికారులను నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓతోపాటు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రికెట్ టీమ్‌కు 16మంది, వాలీబాల్‌జట్టుకు 12 మంది, ఖోఖో 12 మంది, కబడ్డీ 12 మంది, బ్యాడ్మింటన్‌కు 12 మంది వంతున ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేస్తే మొదటగా సచివాలయం స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు.

విజయవంతం చేయాలి

దక్కిలి (బాలాయపల్లె): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రమీలారాణి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

సైదాపురం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి కిట్లు అందజేసినట్లు తెలిపారు.

ప్రతిభ వెలికితీతకే ఆడుదాం ఆంధ్ర

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లో యువతీయువకుల్లో ప్రతిభ వెలికితీతకే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు టీమ్‌లను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు.

సచివాలయాలకు చేరిన కిట్లు

తడ: ఆడుదాం అంధ్ర క్రీడా కిట్లు మంగళవారం మండలంలోని సచివాలయాలకు చేరాయి. మండల కార్యాలయానికి వచ్చిన కిట్లను ఎంపీపీ కే రఘురెడ్డి, ఎంపీడీఓ ఆమోసుబాబు సిబ్బందికి అందజేశారు.

కిట్ల పంపిణీ

వాకాడు: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సామాగ్రిని ఎంపీడీఓ గోపీనాథ్ అన్ని సచివాలయాలకు పంపిణీ చేశారు. వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

కోళ్ల దొంగలను పట్టుకోండి సారూ..!

కోట: కోళ్ల దొంగలను పట్టుకుని, శిక్షించాలని బాధితులు మంగళవారం కోట ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. కొద్ది రోజులుగా కోట, వాకాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఖరీదైన పెంపుడు కోళ్లు చోరీకి గురవుతున్నాయి. వెంకన్నపాళెం, తిన్నెలపూడి, చెందోడు, వంజివాక, బాలిరెడ్డిపాళెం, వాకాడులో వందల సంఖ్యలో కోళ్లు అపహరించారు. గుర్తు తెలియని ముఠా పగలు రెక్కీ నిర్వహిస్తూ రాత్రి వేళలో కోళ్లను అపహరిస్తున్నారని ఆ ఫిర్యాదు లో పేర్కొన్నారు. కోళ్లపై రసాయనాలు చల్లి వాటిని ఎత్తుకుపోతున్నట్లు తెలిపారు. కేవలం ఖరీదైన కోళ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. ఒక్కో కోడి విలువ రూ.5 వేల పైనే ఉంటుందన్నారు.

కచ్చితమైన కొలతలునమోదు చేయాలి

ఓజిలి: గ్రామాల్లో కూలీలు చేసిన పనులను ఉపాధి సిబ్బంది ఎప్పటికప్పుడు సకాలంలో కొలతలు తీసి, మస్టర్ నమోదు చేస్తే రోజుకు రూ.272 నగదు గిట్టుబాటు అవుతుందని క్లస్టర్ ఏపీడీ రవికుమార్‌నాయుడు అన్నారు. మంగళవారం మండల స్త్రీశక్తి భవనంలో మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలను మేట్లు సమన్వ యం చేసుకుని అధికంగా పనికి వచ్చేలా చూడాలన్నారు. కూలీలు చేసిన పనులను కొలతలు ఎలా తీయాలి, మస్టర్ నమోదు తదితర విషయాలను తెలిపారు. ఎంపీడీఓ రజనీకాంత్, ఏపీఓ ఉషారాణి, షీలు, కే మహేష్, ఎస్‌కే రహ్మాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలి

దక్కిలి: నాడు–నేడు కింద ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలను త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, అంగనవాడీ సూపర్‌వైజర్లుతో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ పాల్గొన్నారు.

దారి చూపించాలని వేడుకోలు


గిరిజనులతో మాట్లాడుతున్న సర్వేయర్

చిల్లకూరు: గ్రామానికి రికార్డుల ప్రకారం ఉన్న దారిని చూపాలని నాంచారమ్మపేటకు చెందిన గిరిజనులు వేడుకుంటున్నారు. గతంలో తహసీల్దార్, ఆర్డీలకు వినతి పత్రాలు అందివ్వడంతో మంగళవారం డివిజన్ సర్వేయర్ హరోహర గ్రామంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గతంలో ఉన్న మూడు మార్గాలు కాకపోయినా ఒకే దారి తమకు అనుకూలంగా, పట్టా భూములకు చెందిన వారు ఇబ్బంది పడకుండా సర్వే చేసి దారి ఇవ్వాలని కోరారు. దీంతో సర్వేయర్ 405లో కొంత ప్రభుత్వ భూమి ఉందని మిగిలి ఉందని, 406లో ఉన్న పట్టా భూమి కావడంతో కొంత వివాదం నెలకొందని, దీనిపై పట్టా దారులతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుని గిరిజనులకు న్యాయం చేస్తామన్నారు.

కళాఉత్సవ్‌లో విందూరు విద్యార్థుల ప్రతిభ

గూడూరురూరల్: నెల్లూరు జిల్లా పల్లిపాడు డైట్ కళాశాలలో జరిగిన కళాఉత్సవ్– 2023లో విందూరు జెడ్పీ హైస్కూలు ప్లస్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మండి పూజ, సెనగ అరుణ జానపద నృత్యం, పాట పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు శిక్షకుడు ప్రవీణ్‌గురు తెలిపారు. మంగళవారం పాఠశాలలో వారికి అభినందన సభ ఏర్పాటు చేసి, అధ్యాపకుడు ప్రవీణ్‌గురు, విద్యార్థినులు పూజ, అరుణను హెచ్‌ఎం వెంకట నాగ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధితులకు ఆపన్నహస్తం


దక్కిలి: సరుకులు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులు

దక్కిలి: మిచాంగ్ తుపాన్ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని దగ్గవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు ఘట్టమనేని శ్రీనివాసులునాయుడు అన్నారు. మండలంలోని పాతనాలపాడు (కమ్మవారిపల్లె), నక్కల కాలనీ, గిరిజన కాలనీ, దళితవాడలకు చెందిన 106 కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరద ప్రభావిత గ్రామాల్లో సత్వరమే సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశారని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పంటలు, నివాసాలు కోల్పోయిన బాధితులకు సాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కందాటి గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీ అనిల్ యాదవ్, శ్రీనివాసులు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ ముమ్మరం

చిల్లకూరు: తుపాను బాధితులకు సరుకులు పంపిణీ చేసే కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని ముత్యాలపాడు పరిధిలోని నాంచారమ్మపేట, పారిచెర్లవారిపాళెం, బల్లవోలు గిరిజన కాలనీ, కమ్మవారిపాళెం, గుత్తావారిపాళెం, కడివేడు గిరిజన కాలనీల్లో మంగళవారం ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు.

రైతులను ఆదుకోవడమే ధ్యేయం

గూడూరురూరల్: తుపాను కారణంగా నష్టపోయి న రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు డీ కృష్ణారెడ్డి అన్నారు. తుపాను కారణంగా నారు మడులు దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 80 శాతం సబ్సిడీతో అందించిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని గూడూరులోని మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద మంగళవారం ప్రారంభించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు జనవరిలో పరిహారం అందించేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.గోపీ నాయక్, మండల వ్యవసాయాధికారి వి.రమేష్, టెక్నికల్ ఏఓ చెంచురెడ్డి, చెన్నూరు సలహా మండలి సభ్యులు ఈ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేలము నోటీసు – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
డిప్యూటి రిజిస్ట్రార్ / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ – నెల్లూరు వారి ఉత్తర్వుల మేరకు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వెంకటగిరి పట్టణము నందలి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, వెంకటగిరి బ్రాంచ్ నందు ఈ క్రింది తెలుపబడిన బకాయిదారు తమ కుటుంబ అవసరముల నిమిత్తము అప్పు తీసుకొని ఇంతవరకు పూర్తిగా చెల్లించనందున వారిపై శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, వెంకటగిరి బ్రాంచ్ వారు డిక్రీ పొంది ఉన్నారు. సదరు డిక్రీ మొత్తమును రాబట్టుకొనుటకు గాను ఈ క్రింద చూపబడిన స్థిరాస్తులను సేల్ ఆఫీసరు, డి.ఆర్./ఓయస్‌డి వారి కార్యాలయము, నెల్లూరు వారిచే ఈ క్రింద తెలుపబడిన తేదిలలో బహిరంగముగా ఆయా ప్రదేశములలో వేలము వేయబడును. వేలము పాటకు సంబంధించిన ఇతర షరతులను బ్రాంచ్ మేనేజర్, వెంకటగిరి శాఖ వారి వద్ద నుండి గాని లేక సేల్ ఆఫీసర్ / ఓయస్‌డి వారి కార్యాలయము జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ – గాంధీబొమ్మ వద్ద ట్రంక్ రోడ్డు, నెల్లూరు వారి నుండి గానీ పొందవచ్చు.

వరుస సంఖ్య	తీర్పు బకాయిదారుని పేరు, చిరునామా	ఇప్లు పిటీషన్ నెంబర్	రావలసిన బాకీ మొత్తం	సెంత వేయబడు స్థిరాస్తి వివరాలు: సర్వే నెం.	విస్తీర్ణము(ఎ)	వేలము వేయబడు తేది మరియు సమయం	వేలము వేయబడు స్థలం
1	రాయి రవివర్మ S/o. వెంకటయ్యచౌదరి, బాలాయపల్లి గ్రామం & బాలాయపల్లి మండలం, SPSR నెల్లూరు జిల్లా	58/ 2019-2020	రూ. 23,78,496 + వడ్డీ + ఇతర ఖర్చులు	27-1	10.28AC	తేది 16-12-2023 ఉదయం గం॥11-00లకు	గ్రామ సచివాలయం సింగడి గ్రామం బాలాయపల్లి మండలం SPSRనెల్లూరు జిల్లా

సం/- యస్.వెంకటక్రిష్ణయ్య
సెల్ : 99495 35199, సేల్ ఆఫీసర్, SPSR నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, నెల్లూరు